
# అమెరి'కులాసా' కథలు
## – వంగూరి చిట్టెన్ రాజు





## అమెరికులాసా కథ – 213

# హ్యూస్టన్ స్వర్ణోత్సవాల కథ కాని కథ

నిజానికి ఇది కథ కాదు...కానీ యాభై ఏళ్ళ క్రిందటి జ్ఞాపకాలని నెమరు వేసుకుని అక్షర రూపంలో పెట్టే ప్రయత్నంలో కొన్ని అవాస్తవాలు, అతిశయోక్తులు దొర్లే అవకాశం ఉన్నప్పుడు “వీడు కథలు చెప్తున్నాడురా” అని కొంత మంది అనుకునే అవకాశం ఉంది. అసలు విషయం ఏమిటంటే... మా హ్యూస్టన్ మహా నగరంలో, 1976 లో తెలుగు సాంస్కృతిక సమితి...TCA.... (Telugu Cultural Association) ఏర్పడి ఈ ఏడాదికి 50 ఏళ్ళు అయింది. అనగా...ఈ ఏడు మా సంస్థ స్వర్ణోత్సవాలు ఆర్భాటంగా జరుపుకోడానికి సన్నాహాలు మొదలయ్యాయి. అందులో మొదటి ప్రహసనం అయిన “ఆ పిల్లికి గంట కట్టేది నువ్వా, నేనా?” అనే ‘అమెరికాకుల’ పోరాటాలు ఒక కొలిక్కి వచ్చి, భారీ ఎత్తున ఒక “కార్యనిరవాకుల సంఘం” ఏర్పడింది. మూడు రోజుల పాటు సుమారు ఐదు లక్షల డాలర్లు ఖర్చు పెట్టి కనీ వినీ ఎరుగని హాలీవుడ్, బాలీవుడ్ స్థాయిలో “పాసాకొసీ” పద్ధతిలో ఈ స్వర్ణోత్సవాలు నిర్వహించాలి అని పెద్దలు నిశ్చయించుకున్నారు. పాసా అంటే ‘పాత సారా’ ..అనగా... ఒక బేంక్వెట్, స్వాగత దృశ్యకావ్యం, సినీ తారలు, రాజకీయ వేత్తలు, స్వామీజీలు, నగల దుకాణాలు, విందు భోజనాలు, సినిమా పాటల పోటీలు, మధ్యే మధ్యే కూచిపూడి, ఒక మారుమూల బిక్కుబిక్కుమంటూ కవులూ, పండితులూ...అన్నింటినీ మించి వందలాది పతకాలు, శాలువా పంపిణీలు...."కొసీ” అంటే కొత్త సీసా..అనగా స్వర్ణోత్సవాలు అనే కొత్త పేరు..అంతా అయ్యాక నిర్వాహకులు ఒకరినొకరు నొప్పి పుట్టేలా భుజాల చరుపులు, సెల్ఫీలు... అంతా సేమ్ టు సేమ్! మన తెలుగు సినిమాల లాగా టైటిల్ మారుతుంది అన్నింటికీ కథ ఒకటే!. ఈ మధ్యనే ఈ భారీ స్వర్ణోత్సవాల కోసం విరాళాల వేట మొదలయింది కానీ అదృష్టవశాత్తూ భవదీయుడు విరాళం పుచ్చుకునే బాపతే కానీ ఇచ్చే దాత కానే కాదు అనేసుకుని ఆ డిపార్ట్ మెంట్ వాళ్ళు మా ఇంటి గడప తొక్క లేదు. ఇంకా నయం. పొరపాటున అలా మా ఇంటి ముందు జోలె పట్టుకుని బెల్ కొట్టారో....మా క్వీన్ విక్టోరియా పవర్ ఏమిటో రుచి చూసే వారు.

అనాడు 1976 లో ఈ సంస్థ ప్రారంభించిన వ్యవస్థాపక సహ–సమన్వయ కర్త అనగా సహ–అధ్యక్షుడిని నేను కాబట్టిన్నీ, గత యాభై ఏళ్ళగా ఆ సంస్థని సొంత బిడ్డలా పెంచి పోషించిన వారిలో నా పాత్ర పెద్దదే కాబట్టిన్నీ ఈనాటి స్వర్ణోత్సవాల సందర్భంగా నేను కాలర్ ఎగరేసుకుంటున్నాను. ఆనాటి పిట్ట కథ ఏమిటంటే అప్పుడు హ్యూస్టన్ లో పాతిక తెలుగు కుటుంబాలు, నాలాగా బ్రహ్మచారులైన ఐదారుగురు ఉన్నప్పుడు ఇలా ఒక తెలుగు సంఘం పెట్టాలి అని అనే ఆలోచన నాకు రావడం, నెలల తరబడి తర్జన భర్జనల తర్వాత అందరూ ఒప్పుకోవడం జరిగింది. మరి ఆ సంస్థ కి "అధ్యక్షుడు" అంటే అదేదో అమెరికా ప్రెసిడెంట్ పదవి లాగా ఫీల్ అయిపోయి దాని కోసం కొట్టుకు చస్తావేమో అనుకుని సింపుల్ గా ముందుగా ఏడుగురు నిర్వాహక వర్గం సభ్యులని ఎంపిక చేసుకుని, వారిలో వారే ఒకరిని సమన్వయ కర్త గానూ ఎంపిక చేసుకోవాలి అని ఒక పేజీ రాజ్యాంగం రాసుకున్నాం, తెలుగులో ఆ రాజ్యాంగం, నిబంధనలు నేనే రాశాను. ఆ తతంగంలో ఊళ్లో ఒక పెద్దాయనని ఉత్సవ విగ్రహం లాగా సమన్వయ కర్త గా, అరవ చాకిరీ చెయ్యడానికి వంగూరి చిట్టెన్ రాజు అనే యువకుడిని...అంటే నేనే.....సహ–సమన్వయ కర్త గానూ ఎన్నుకున్నారు. ఆ తర్వాత 1990 లలో దాన్ని ప్రెసిడెంట్ గానే మార్చడం, పాతికేళ్ళకి..అంటే 2003 లో నేనే ప్రెసిడెంట్ గా మా టీసీయే రజతోత్సవాలు నిర్వహించి, అప్పటినుంచీ సమితి బాధ్యతలు తర్వాత వచ్చిన యువతరానికి అందించడం జరిగాయి అనుకోండి..అది వేరే సంగతి.

హ్యూస్టన్ తెలుగు 'ఆది మానవుల" లో ఒకడిగా ఆ నాటి కొన్ని స్థానిక పరిస్థితులని ఈ నాటి పరిస్థితులతో పోలిస్తే భలే సరదాగా ఉంటుంది. ఇవి చదివి ఈ తరం వారు మమ్మల్ని చూసి"పాపం, ఆ గుహల్లో ఎలా ఉండేవారో కదా" అని అనుకున్నా, మా తరం అలా అనుకోం సరి కదా....మిమ్మల్ని చూసి చాలా విషయాల్లో జాలి పడతాం కూడా!

నమ్మండి, నమ్మక పొండి..

- 1975–76 సమయం లో యావత్ టెక్సస్ రాష్ట్రం లో ఒకే ఒక ఇండియన్ రెస్టారెంట్ ఉండేది. అది హ్యూస్టన్ లో రైస్ యూనివర్శిటీ పక్కన...దాని ఓనర్, వంటవాడు, వైటర్, క్లీనర్ అన్నీ ఒకడే. మా అనిల్ కుమార్!. ఆ రెస్టారెంట్ లోనే అతని భార్య సుప్రసిద్ధ కూచిపూడి నర్తకి రత్న పాప 56 సంవత్సరాల క్రితం టీసీయే కంటే ముందే ఈ నాటి ప్రపంచ ప్రఖ్యాత అంజలి సెంటర్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ ప్రారంభించినది. అనిల్ కుమార్ ని నేను మొట్టమొదట కలిసినది అక్కడే!. అతను కాకినాడలో నాకు సీనియర్ కానీ అప్పుడు పరిచయం లేదు.
- హ్యూస్టన్ మొత్తానికి జే స్టోర్ అనే ఒకే ఒక గుజరాతీ ఇండియన్ రెస్టారెంట్ ఉండేది. తెలుగు పప్పులూ, ఉప్పులూ కావాలంటే ఆ అమ్మాయికి అందరూ కలిసి మెలిసి ఒక లిస్ట్ రాసి ఇచ్చి, న్యూయార్క్ నుంచి తెప్పించి పంచుకునే వారు. ఆ లిస్ట్ లో నెంబర్ వన్ ఐటెమ్: త్రివేణీ వక్క పొడి...దొరికినప్పుడల్లా..

- హ్యూస్టన్ మొత్తానికి ఒకే ఒక గుడి..అది కూడా ఎక్కడో నార్త్ లో ఒక చిన్న ఇంట్లో నాలుగు విగ్రహాలు పెట్టిన గుజరాతీ వాళ్ళ ఏర్పాటు చేసినది. 1976–77 లలోనే నిజమైన గుడి కట్టుకోవాలి అని ఇండియన్స్ అందరూ అనుకోవడం, అది దక్షిణ భారత దేశం లో గుడి లాగే ఉండాలి అని తమిళులు పట్టు పడి విడిపోయి, అప్పుడు పేరు కూడా వినని పియర్ లాండ్ అనే మారుమూల పల్లెటూరిలో మధుర మీనాక్షి దేవాలయం నమూనాలో "శ్రీ మీనాక్షీ దేవాలయం" ప్రతిష్టాపన జరిగాయి. ఉత్తర అమెరికాలో అదే మొట్టమొదటి శక్తి పీఠం.
- 1975 –76 నాటికి పెర్సనల్ కంప్యూటర్ వాడకం లేనే లేదు. ఇంటర్ నెట్, ఇమైల్, సెల్ ఫోన్ మొదలైన పదాలు పుట్టనే లేదు. ఇండియా ఫోన్ చెయ్యాలంటే ఆపరేటర్ ద్వారా పి.పి..అంటే పెర్సన్ టు పెర్సన్ కాల్ బుక్ చేసుకోవాలి. స్థానికంగా కూడా..మరొక నగరానికి పగలు ఫోన్ చేస్తే ఒక రేట్..రాత్రి ఎనిమిది దాటాక సగం రేటు...అంచేత ఇండియాకే కాదు, అమెరికాలో కూడా ఉత్తరాలు వ్రాసుకునే అలవాటు ఉండేది.
- ఆదివారం అన్ని దుకాణాలూ బంద్!. పెట్రోల్ ఖరీదు లీటర్ కి 50 సెంట్లు లోపునే! రెస్టారెంట్ లో వెజిటేరియన్ ఏమున్నాయి అని అడిగితే అంటే ఏమిటి? అనే వారు. సూపర్ మార్కెట్ లో కానీ మరెక్కడా కానీ గుత్తి వంకాయ, నీటి వంకాయ, దొండ, పొట్ల, ఆనప, చేమ దుంపలు..ఇలాంటివి ఏమిటో ఎవరికీ తెలీదు.
- 1975–80 ప్రాంతాలలో తెలుగు సినిమా ఎలా చూడాలా అని అందరం తహతహ లాడేవాళ్ళం. 1979 అని గుర్తు..,,అప్పుడు అనుకోకుండా అప్పటి ప్రముఖ నిర్మాత, దర్శకులు యు. విశ్వేశ్వర రావుగారు అమెరికాలో మొదటిసారి అనుకుంటాను.....రెండు 16 mm తెలుగు సినిమాల రీల్స్ అమెరికా తీసుకుని వచ్చారు. పూర్తి ఫిల్మ్ సైజ్ అయిన 35 mm తెచ్చినా ప్రదర్శించే అవకాశం అమెరికాలో లేనే లేదు. మొదటిది 1968 లో విడుదల అయిన 'సుడిగుండాలు". ఆదుర్తి దర్శకత్వం వహించిన ఈ చిత్రం లో అక్కినేని, సుకన్య నటించారు. అందులో బాలనటిగా నటించిన కోసూరి ఉమా భారతి గారు 1980 లలో హ్యూస్టన్ నివాసిగా స్థిరపడ్డారు. రెండో సినిమా ఎన్టీఆర్, సావిత్రి లతో విశ్వేశ్వర రావు గారు స్వయంగా నిర్మించి దర్శకత్వం వహించిన 'తీర్పు" అనే సినిమా. స్థానిక "నల్ల జాతీయుల" టెక్సస్ సదరన్ యూనివర్సిటీ లో ఒక క్లా రూమ్ లో బ్లాక్ బోర్డ్ మీద తెల్ల దుప్పటీ కట్టి, నేను మా ఆఫీసు నుంచి "అద్దె" కి తెచ్చిన 16 mm projector తో అనిల్ కుమార్, నేనూ ఆ సినిమాలు వేశాం.
- మా హ్యూస్టన్ తెలుగు సాంస్కృతిక సమితి నిర్వహించిన మొట్టమొదటి అధికారిక సాంస్కృతిక కార్యక్రమం మార్చ్ 1977లో జరిగిన ఉగాది. యూనివర్సిటీ ఆఫ్ హ్యూస్టన్ లో జరిగిన ఆ కార్యక్రమం లో దువ్వూరి సూరి, అనిల్ కుమార్, నేనూ చెప్పిన బుర్ర కథ, "బామ్మాయణం అను సీతాకల్యాణం" అనే నాటకం, రత్న పాప కూచిపూడి "భామా కలాపం", "మొక్కజొన్న తోటలో.." జానపద నృత్యాలూ, చాప మీద కూచుని స్థానిక గాయనీగాయకుల లలిత, సినీ సంగీత విభావరి మొదలైనవి ప్రధానాంశాలు.

- కేవలం యాదృచ్చికమే అయినా.....1977 మార్చ్ నెలలో మా టీసీయే తొలి ఉగాది కార్యక్రమం అయినప్పుడే అక్కడ ఇండియాలో ఇందిరా గాంధీ ఓడిపోయి ఎమర్జెన్సీ పరిపాలన అంతం అయి ప్రజాస్వామ్యం మళ్ళీ నిలదొక్కుకుంది. ఈ వార్త అమెరికన్ టీవీలో విని "అయ్య బాబోయ్. ఇండియా పేరు టీవీలో వినపడిందోచ్" అని ఎంతో సంతోషపడిపోయాం. ఎందుకంటే...ఆనాటి అమెరికన్ టీవీలో ఇండియా పేరు ఎప్పుడూ ఏదో ఒక నెగెటివ్ కారణాలకో, కించ పరచడానికో మాత్రమే వినపడేది. అంతే కాదు. అదే ఏడు 1977, నవంబర్ లో దివి సీమసీమ ఉప్పెన వచ్చి సుమారు 15 వేల మంది చనిపోయినప్పుడు , రివరరెండ్ బిల్లీ గ్రాహం స్వయంగా ఇండియా వెళ్ళడం, ఆ వార్త చెప్పిన టీవీ రిపోర్టర్ "అవని గడ్డ, అంధ్ర ప్రదేశ్" అనడం, ఆనాటి అమెరికన్ టీవీలో ఆంధ్ర ప్రదేశ్ అని మొదటి సారిగా విన్నప్పుడు ఒక పక్క చిన్న సంతృప్తి, మరొక పక్క ఆ భయంకరమైన ప్రకృతి విపత్తు కి విషాదం..చెప్పుకోలేని పరిస్థితి. ఎంతో గుర్తు లేదు కానీ ఆనాటి విపత్తుకి టీసీయే తరఫున విరాళాలు పోగుచేసి రెడ్ క్రాస్ కి పంపించాం. అదే మా టీసీయే మొదటి సమాజ సంక్షేమ కార్యక్రమం.
- అప్పుడు తెలియదు కానీ... అనాడు "అమెరికీకరణ" కోసం ఇక్కడి పద్ధతిలో 'కమర్షియల్ బ్రేక్" వంకతో నా "హాస్య పైత్యం" జోడించి తిరగ రాసిన ప్రయాగ నరసింహ శాస్త్రి గారి "బొబ్బిలి యుద్ధం" బుర్ర కథ, నా మొట్టమొదటి నాటక రచన అయిన ఆ "బామ్మాయణం" నాటకం యావత్ అమెరికాలో మొట్టమొదటి తెలుగు నాటిక, మొట్టమొదటి బుర్రకథ అని చరిత్రలో నమోదు అయినట్టు ఈ నాటి కృత్రిమ మేధ ని అడిగితే తెలిసింది. అలా అని ఈ కృత్రిమ మేధ చెప్పినదల్లా 'వేదం' కాదు సుమా...ఎవరు, ఎప్పుడు, ఏ భాషలో ఎందుకు, ఎలా, ఏ సమయంలో అడిగారో దాన్ని బట్టి వాటికీ "కళా కళలు" ఉంటాయి...AI కి అబద్ధాలు ఆడే అలవాటు కూడా ఉంది అని నా స్వానుభవం! ఉదాహరణకి అమెరికాలో మొదటి సాహితెలుగు సాహిత్య పత్రిక ఏమిటి? అని అడిగితే "1977 లో మొదలైన మధురవాణి' అని సమాధానం వచ్చింది. అది తప్పు కదా!....కానీ ఇరవై ఏళ్ళకి పైగా నడిచిన ఏకైక సాహిత్య పత్రికగా మన "మధుర వాణి" కి వచ్చిన గుర్తింపు నిజమే మరి! అలాగే అమెరికాలో మొట్టమొదటి నాటకం 1970 లలో డిట్రాయిట్ లేదా అట్లాంటాలో వేసిన "కన్యాశుల్కం" అయిఉండవచ్చు కానీ, స్థానిక అమెరికా తెలుగు వారు వ్రాసి ప్రదర్శించిన మొదటి సాంఘిక నాటకం "బామ్మాయణం" అనేది సరి అయిన గుర్తింపే!.

ఇలా గుర్తు చేసుకుని చెప్పుకోడానికి చాలా సంగతులే ఉన్నాయి కానీ... ఎవడిక్కావాలోయ్ నీ సుత్తి అనుకునే వాళ్ళని అలానే అనుకోనిద్దాం, ఈ సారికి ఇలా కానిద్దాం అంటాను. ఏమంటారు?

**COMMENTS**